ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7 । కనిష్ఠం 24.9
నిర్మల్
జిల్లా వార్తలు
8
శుక్రవారం 25 జూలై 2025



జ్యోతిర్లింగ యాత్రకు స్పెషల్‌బస్సులు

నిర్మల్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో భద్ర హనుమాన్ యాత్రకు స్పెషల్ బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే. పండరి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆర్టీసీడిపో నుంచి మహా రాష్ట్రలో గల పడుకునే హనుమాన్ మందిర్ శ్రావణ మాసంలో దర్శించు కుంటారన్నారు. మహారాష్ట్రలో గల ఔరంగాబాద్ దగ్గరలో గల భద్రహ నుమాన్‌కు పురాణాలప్రకారం చివరి 12వ ఘృష్ణేశ్వర జ్యోతిర్లంగం దర్శనం చేసుకోవడానికి ప్రత్యేకబస్సు నడుపుతున్నట్లు తెలిపారు.



కడుపు కోతలు

- తగ్గుతున్న సహజ ప్రసవాలు
- అడ్డగోలుగా సిజేరియన్‌లు
- కాసుల కోసం కక్కుర్తి పడుతున్న ప్రైవేటు దవాఖానాలు
- కలెక్టర్ హెచ్చరికలు సైతం బేఖాతరు

నిర్మల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో కడుపు కోతల దందా యథేచ్ఛగా సాగుతోంది. ప్రైవేటు ఆసుపత్రుల కాసుల కక్కుర్తి అమాయక గర్భిణులకు ప్రాణ సంకటంగా మారుతోంది. సహజ ప్రసవాలకు అవకాశం ఉన్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రులు కాసులకు కక్కుర్తి పడుతూ అనవరం లేకున్నా సిజేరియన్‌లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సిజేరియన్‌లు తగ్గించి నార్మల్ డెలివరీలను పెంచాలని ఇప్పటికే పలుసార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఆ ఆదేశాలను ధిక్కరించి యథేచ్ఛగా సిజేరియన్‌ల దందాను ప్రోత్సాహిస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొంతమేరకు సహజ ప్రసవాల శాతం పెరుగుతున్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం దాదాపుగా సిజేరియన్‌లకే మొగ్గు చూపుతున్నారన్న విమర్శలున్నాయి. వైద్యారోగ్య శాఖ జిల్లా అధికారి సిజేరియన్‌లు తగ్గించి సహజ ప్రసవాలను పెంచాలని ఇటు ప్రైవేటు ఆసుపత్రులు అటు ప్రభుత్వ ఆసుపత్రులకు పలుసార్లు హెచ్చరికలు జారీ చేసినా ఫలితం కనిపించడం లేదంటున్నారు. జిల్లాలో గత ఆరు నెలల వ్యవధిలో జిల్లాలో 4,579 ప్రసవాలు జరగగా ఇందులో నుంచి 3,790 సిజేరియన్‌లు కావడం పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తోంది. దాదాపు 80 శాతానికి పైగా జిల్లాలో సిజేరియన్‌లు జరుగుతున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో మొత్తం 2,127 ప్రసవాలకు గానూ 578 సాధారణ ప్రసవాలు, 1,549 సిజేరియన్‌లు జరగగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో 211 మాత్రమే సహజ ప్రసవాలు జరిగాయి. కాగా 2,241 సిజేరియన్‌లు ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. అయితే చాలా మంది గ్రామీణ ప్రాంతాల గర్భిణులు ఆర్ఎంపీల సహకారంతో ప్రసవాల కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో కమీషన్‌ల దందా జరుగుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. దీనికి కారణంగా ప్రైవేటు ఆసుపత్రులు డెలివరీ ప్యాకేజీ పేరిట ఒక్కో సిజేరియన్‌కు రూ.40 వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల సౌకర్యాలుండడమే కాకుండా క్వాలిఫైడ్ గైనకాలజిస్టులు ఉన్నారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని మెటర్నటీ ఆసుపత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీలకు సంబంధించిన అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రైవేటు ఆసుపత్రుల ఆకర్షణీయ ప్రచారం, ఆర్ఎంపీల కమీషన్‌ల దందాతో సిజేరియన్‌ల సంఖ్య పెరిగిపోతోందన్న వాదనలున్నాయి.

డెలివరీ ప్యాకేజీలు

ఇదిలా ఉండగా నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసాలో పలు ప్రైవేటు ఆసుపత్రులు డెలివరీ ప్యాకేజీల విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ప్యాకేజీలో భాగంగా సాధారణ ప్రసవాలను పక్కన పెట్టి సిజేరియన్‌లకే ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. సిజేరియన్ డెలివరీలకు సంబంధించి రూ.40వేల నుంచి రూ. 50వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ ప్యాకేజీతో పాటు డెలివరీ అయిన చిన్న పిల్లలకు సంబంధించి కూడా మళ్లీ పిల్లల దవాఖానాలకు రిఫరల్ చేస్తున్నారు. దీనికి అదనంగా ఫీజులు వసూలు చేస్తుండడం గమనార్హం. ప్రతీ ఆసుపత్రిలో ప్యాకేజీల విధానం అమలవుతోంది. సాధారణ ప్రవసం జరిగే అవకాశం ఉన్నప్పటికీ కొన్ని దవాఖానాల్లో సిజేరియన్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు విమర్శలున్నాయి. గర్భిణులకు అలాగే వారి కుటుంబ సభ్యులకు డెలివరీ విషయంలో బయపెట్టి ఈ అవసరం లేకున్నా సిజేరియన్‌లను చేస్తున్నారంటున్నారు.

ఆసుపత్రి	నార్మల్ డెలివరీలు	సిజేరియన్‌లు	మొత్తం
ప్రభుత్వ ఆసుపత్రి	578	1549	2127
ప్రైవేటు ఆసుపత్రులు	211	2241	2452
మొత్తం	789	3790	4579

ఆర్ఎంపీలే సూత్రధారులు

జిల్లాలో ఇప్పటికే ప్రైవేటు వైద్య రంగాన్ని ఆర్ఎంపీ వైద్యులు శాసిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీనికి అనుగుణంగానే వివిధ రకాల జబ్బుల వైద్యం కోసం కొంతమంది ఆర్ఎంపీలు తమకు కమీషన్‌లు చెల్లించే ఆసుపత్రులకు మాత్రమే రిఫర్ చేస్తున్నారు. దీని కారణంగా ప్రైవేటు ఆసుపత్రులు ఆర్ఎంపీ డాక్టర్‌లకు పెద్ద మొత్తంలో కమీషన్‌లు కూడా చెల్లిస్తున్నట్లు కూడా చెబుతున్నారు. దీని కోసం రోగులకు భారీ మొత్తంలో ఫీజులు విధించి వారి నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారంటున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సహజ ప్రసవాలకు ప్రోత్సాహం

అయితే ప్రైవేటు ఆసుపత్రులకు భిన్నంగా ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రం సహజ ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. గత ఆరు నెలల కాలంలో 578 సహజ ప్రసవాలు జరగగా, 1,549 సిజేరియన్‌లు జరిగాయి. మొత్తం ప్రభుత్వాసుపత్రుల్లో 2,127 ప్రసవాలు జరగగా ఇందులో నుంచి 578 సహజ ప్రసవాలు జరిగాయి. సహజ ప్రసవాల కోసం ప్రయత్నిస్తున్న డాక్టర్‌లను గర్భిణుల కుటుంబీకులే సిజేరియన్‌ల కోసం ఒత్తిడి చేస్తున్నట్లు సైతం ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ముహూర్తాలు, ఘడియల పేరిట సిజేరియన్‌లకే కొంత మంది ప్రాధాన్యతనిస్తూ డాక్టర్‌లపై ఒత్తిడిని పెంచుతుండడంతో చివరి వరకు డాక్టర్‌లు వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఇటు ప్రభుత్వ అటు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇప్పటి వరకు మొత్తం 789 సహజ ప్రసవాలు జరగగా 3,790 సిజేరియన్‌లు జరిగినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం...

● రాజేందర్, డీఎంహెచ్‌వో, నిర్మల్ జిల్లా

ప్రైవేటు ఆసుపత్రులు బలవంతంగా సిజేరియన్‌లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గత్యంతరం లేని పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్‌లు చేయాలే తప్పా సహజ ప్రసవాలకే ప్రాధాన్యతనివ్వాలని, సహజ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలి. ప్రైవేటు ఆసుపత్రులపై సహజ ప్రసవాల విషయంలో తాము నిఘా సారిస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడేది లేదు.

పీఎం జన్‌మన్ పనులు వేగవంతం చేయాలి

● కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శి విభూనాయర్


జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పీఎం జన్‌మన్ (ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్) కార్యక్రమాన్ని వేగంగా పూర్తిచేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభూనాయర్ రాష్ట్ర కలెక్టర్లకు సూచించారు. గురువారం సాయంత్రం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గిరిజన సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆధార్ నమోదు, జన్‌ధన్‌ఖాతాలు, పక్కాఇళ్లు, పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్‌కార్డులు వంటి పథకాలను విజయవంతంగా అమలు చేయాలని, కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షణ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... పీఎం జన్‌మన్ కింద చేపట్టాల్సిన అన్ని పనులు గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీపీవో శ్రీనివాస్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, వ్యవ సాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఎల్డీఎం రామ్‌గోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండండి

● ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ అమర్ ప్రతాప్ సింగ్


బాధనకుర్తిలో అవగాహన కల్పిస్తున్న బృందాలు

ఖానాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో విపత్కర పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ అమర్ ప్రతాప్‌సింగ్ సూచించారు. గురువారం మండలంలోని బాధనకుర్తిలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామానికి నలువైపుల గోదావరినది ప్రవహిస్తున్న నేపథ్యంలో భారీవర్షాలకు నది ఉప్పొంగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవగాహన సదస్సుకు ఖానాపూర్ తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, తదితరులు హాజరయ్యారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న అధికారి

నిర్మల్‌రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రాంనగర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రోగులకు మెరుగైన నాణ్యమైన సేవలను అందించాలని తెలిపారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి వ్యాధుల నియంత్రణకు, నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలిన చోట వెంటనే స్పందించి ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, చికిత్స అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, డాక్టర్ తేజస్విని, కమ్యూనిటీ ఆర్గనైజర్ రమణ, సిబ్బం ది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్జీయూకేటీ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

బాసర,జూలై 24 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ కొనసాగుతోంది. గురువారం గ్లోబల్ కోటా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొగోవర్ధన్ విద్యార్థులకు తల్లిదండ్రులతో ముఖాముఖీ మాట్లాడారు. గ్లోబల్ కోటా కింద ప్రవేశ విధానం, నియమనిబంధనలు, ఫీజు చెల్లింపులు, విద్యా విధానం, అందించబోయే కోర్సుల వివరాలు, క్యాంపస్ వసతులు గురించి వివరించారు. రెండు విడతల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి మూడో విడత జాబితా విడుదల చేశారు. విద్యార్థులకు శుక్రవారం కౌన్సెలింగ్ జరుగనుంది.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

● భైంసా అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

భైంసా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గాను ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాలని భైంసా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా.ఫిర్దోస్ జబీన్ సూచించారు. గురువారం మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని ఓవైసీనగర్ కాలనీ పరిధిలో వైద్య శిబిరం, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. వర్షాలు జోరందుకుంటున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్త చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. వ్యక్తిగత శుచి, శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్యశిబిరంలో వంద మందికి పైగా రోగులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఇందులో హెచ్‌ఈవో కలీమొద్దీన్, ఆరోగ్య ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

● ముథోల్‌ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్


ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌ను కలిసిన అధికారులు

భైంసా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలో చోటు చేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్‌రామరావ్ పాటిల్ విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. గురువారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ సాలియ నాయక్, డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈ ఆదిత్య పాటిల్‌తో కూడిన విద్యుత్ అధికారులతో బృందంతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల చోటు చేసుకున్న విద్యుత్‌ప్రమాదాల మూలంగా మూగజీవాల మృత్యువాతలు అధికమయ్యాయని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వివరించారు. వీటి నివారణకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే క్రమంలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గ పరిధిలో నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణపు పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టి నిర్ణీత గడువులోగా సంబంధిత పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇందుకు స్పందించిన ఎస్‌ఈ సాలియ నాయక్ ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా విద్యుత్‌శాఖకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు చేపడుతామని ఈ సందర్భంగా వెల్లడించారు.

గ్రంథాలయ నిర్వహణపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీలు

లక్ష్మణచాంద, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్యాల్‌లో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ప్రాథమిక తరగతులు బోధించే ఉపాధ్యాయులకు గ్రంథాలయాల నిర్వహణ, ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీపై గురువారం సమావేశం నిర్వహించారు. మండల విద్యాధికారి ఆర్.అశోక వర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటు - నిర్వహణ - ప్రాముఖ్యత అనే అంశంపై సవివరంగా చర్చించారు. తెలంగాణ స్కూల్‌ఎడ్యుకేషన్ యాప్‌లో బేస్‌లైన్ టెస్టుకు సంబంధించిన మార్కుల నమోదు, రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు, వర్క్‌బుక్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థ పటిష్టంగా అమలు చేస్తున్న కార్య క్రమాలైనటువంటి బాలశక్తి, ఫోక్సో చట్టం, డ్రగ్స్, గంజాయి, మత్తు పదా ర్థాలు, ధూమపానం వంటి చెడు వ్యసనాలను నిరోధించే చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సాయన్న, మోహన్, సీఆర్‌పీలు మహేందర్, సుధాకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరివాహక ప్రాంత ప్రజలకు సహకారం అందించండి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నిర్మల్‌టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలకు సూచించారు. ఎటు వంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు సంబంధిత శాఖల అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండి తక్షణ పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. భారీవర్షాల వలన ఎక్కడైనా ప్రమాదం ఎదురైతే లేదా సహాయం అవసరమైతే నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 9100577132ను వెంటనే సంప్రదించాలని ప్రజలకు ఈ సందర్భంగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సత్తెనపల్లి పీఏసీఎస్‌లో అవకతవకల ఆరోపణలపై విచారణ


వివరాలు సేకరిస్తున్న విచారణ కమిటీ అధికారులు

ఖానాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సత్తెనపల్లి పీఏసీఎస్‌లో అవక తవకలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై గురువారం జిల్లా అధికారులు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ కమిటీ అధికారులు జిల్లాపరిషత్ సీఈవో గోవింద్, జిల్లా ఆడిట్‌అధికారి విజయలు సత్తెనపల్లి పీఏసీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలస్తు రాజన్న, బత్తుల నారాయణలను పిలిచి వారి వద్ద ఉన్న ఆధారాలను సేకరించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్ నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన విచారణ కమిటీ అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు తాము విచారణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విచారణలో సత్తెనపల్లి పీఏసీఎస్ తాలూకు 10 నుంచి 12 ఏళ్ల రికార్డులను పరిశీలించాల్సి ఉంటుందని, పూర్తివివరాలు తేలే వరకు సమయం పడుతుందన్నారు. తమకు కావాల్సిన సమాచారాన్ని ప్రస్తుతం ఇరు వర్గాల నుంచి సేకరించామని, మిగతా సమాచారాన్ని తమకు పంపాల్సిందిగా సీఈవో నబికి సూచించినట్లు పేర్కొన్నారు. గతంలోనే పీఏసీఎస్ తాలూకు రికార్డులను డీసీవో సీజ్‌చేశా రని, వారి వద్ద ఉన్న రికార్డులలో తమకు కావాల్సిన సమాచారాన్ని అందజేయాలని సీఈవో నబికి సూచించారు.

గతంలో సీఈవోగా విధులు నిర్వ హించిన శ్రీనివాస్‌పై ఆరోపణలు వచ్చిన నేప థ్యంలో ఆయన నుంచి సైతం వివరాలు సేకరిస్తామన్నారు. విచారణలో పూర్తి వివరాలను సేకరించిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందజే స్తామన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి

● జిల్లా విద్యాధికారి పి.రామారావు


కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

సారంగాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులతో పఠనాసక్తిని పెంపొందించాలని జిల్లా విద్యాధికారి పి.రామారావు అన్నారు. గురువారం సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్‌పీ సామర్థ్యాలు విద్యార్థుల్లో మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ప్రతి పాఠశాలలోని విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రిపోర్టుల ఆధారంగా ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ఫోక్సో చట్టంపై విద్యార్థులలో అవగాహన కల్పించాలన్నారు. అన్ని అంశాలను ఆన్‌లైన్ చేయడంలో అశ్రద్ధ వహించకుండా వెంట వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసి జిల్లాను ముందంజలో ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బి.మహేందర్, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త జి.లింబాద్రి, ప్రధానోపాధ్యాయులు వై. సాయన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముథోల్ : కేంద్ర విద్యా శాఖ ఆదేశాల ప్రకారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని యూడైస్ కలిగిన అన్ని పాఠశాలలు, కళాశాలలు పొగాకు రహిత సమాజం కోసం పాఠశాలల మధ్య పలు పోటీలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు ఒక ప్రకటనలో తెలి పారు. కార్యక్రమంలో జిల్లాలోని యూడైస్ కలిగిన అన్ని పాఠశాలలు పాల్గొని, నాలుగు అంశాలలో కార్యక్రమాలు నిర్వహించి, వాటి ఫోటోలు, వీడియోలు పైగా ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందు కోసం అన్ని పాఠశాలలో కార్యక్రమాలు జూలై 31 లోగా నిర్వహించి ఆన్‌లైన్‌లో చేయాలని తెలియజేశారు.

నర్సాపూర్‌లో జిల్లా పంచాయతీ అధికారి పర్యటన

నర్సాపూర్(జి), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) పోత కోటి శ్రీనివాస్ నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో పర్యటించి, వర్షాకాలంలో ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. ఆయన గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పను లను, పారిశుద్ధ్య కార్యక్రమాలను సమీక్షించారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు ఉద్దేశిం చిన డ్రై డే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే డీపీవో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఆసుపత్రిని సందర్శించి, ఇందిరమ్మ ఇళ్లు, గృహ నిర్మాణ పథంలో పురోగతిని పరిశీలించారు. పర్యటనలో మండల పంచాయతీ అధికారి తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కైలాస్, సిబ్బంది శ్రీను, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

సారంగాపూర్ ఎంఈవోగా మహేందర్


ఎంఈవోగా బాధ్యతలు చేపడుతున్న మహేందర్

సారంగాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల ఎంఈవోగా కౌట్ల (బీ)లో గల జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మహేందర్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఎంఈవో విధులు నిర్వహించిన మధుసుదన్ మృతిచెందడంతో జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు మహేందర్ బాధ్యతలు చేపట్టారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

నిర్మల్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన శారదను సన్మానించినట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు కొట్టే శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు రామ్‌రెడ్డి, వెంగ్వాపేట్ మాజీసర్పంచ్ రమేష్, జామ్ మాజీ ఎంపీటీసీ రాజలింగం, ప్రేమ్‌నాథ్ రావు, నాయకులు శంకర్, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి పోలీసుల బాసట


వాహనం వద్ద ఉన్న వృద్ధురాలు

నిర్మల్‌రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షంలో తడిసిన వృద్ధురాలికి బాసటగా నిలిచినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొండాపూర్ బ్రిడ్జి వద్ద ఎల్లపు ఎల్లమ్మ(70) అనే వృద్ధురాలు వర్షంలో పూర్తిగా తడిసి ఓ వాహనం కింద కూర్చుని సహాయం కోసం ఎదురుచూస్తుండగా 100 డయల్ ద్వారా సమాచారం అం దుకున్న రూరల్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లి వృద్ధురాలిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించి భరోసా కల్పించి నట్లు తెలిపారు.

బెదిరించిన ఇద్దరి అరెస్టు

భీంపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తికి బెదిరించిన ఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని ధన్నోర గ్రామానికి చేసిన గోసుకుల సతీష్ అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన షేక్‌వసీం, లంకత్ ముత్తన్నలు వారం క్రితం ఫోన్ చేసి దుర్భాషలాడి బెదిరించారు. అందుకు తీవ్రమనస్తాపానికి గురైన సతీష్ పురుగులమందు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడ్డాడు. సతీష్ తండ్రి గోసుకుల భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ, ఎస్‌ఐలు వీర్‌సింగ్‌నాయక్‌లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నిఘా పెం చాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ఎంతటి వారినైనా కఠినా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను నియమించామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

రైతును బెదిరించి వ్యక్తులపై కేసు

ఆదిలాబాద్ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తన సొంత పశువులను తరలిస్తున్న రైతును బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సెప్టెంబర్‌లో తలమడుగు మండలంలో కుచులపూర్ గ్రామానికి చెందిన రైతు ఆత్మారాం బాపురావు షిండే తన పశువులను ఆదిలాబాద్ మార్కెట్‌లో అమ్మకానికి తీసుకువస్తున్న క్రమంలో తాంసి మండలం పొన్నారి శివారు వద్ద కొంత మంది యువకులు అడ్డగించి డ్రైవర్‌ను కొట్టి డబ్బులు డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. భయపడిన రైతు రూ.5 వేలు ఇవ్వగా.. తాము అడిగిన మొత్తం ఇవ్వలేదని సదరు రైతుపైనే తాంసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. బెదిరింపులకు భయపడ్డ రైతు అప్పటి నుంచి మౌనంగా ఉండగా... తాజాగా పోలీసులు తీసుకుంటున్న చర్యలతో ముందుకు వచ్చి తనను బెదిరించిన వ్యక్తులపై ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఆదిలాబాద్‌కు చెందిన రోహిత్ షిండే, విశ్వ తేజ, సాయి, మహేష్, శివ, రమేష్ వైరాగి, విజయ్ కేంద్రే అనే వ్యక్తులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామనే కారణాన్ని చూపి అమాయకులపై బెదిరింపులకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

డ్రైనేజీలో వృద్ధుడి మృతదేహం

బాసర, జూలై24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డ్రైనేజీలో గురువారం వృద్ధుడి మృతదేహం లభించడం కలకలం రేపింది. పోలీసులు గ్రామస్థుల వివరాల ప్రకారం బస్టాండ్ సమీపాన డ్రైనేజీలో మురికి కూపంలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డ్రైనేజీ పైకప్పు పగులగొట్టి మృతదేహన్ని బయటకు తీసిన పోలీసులు చెప్పుల దుకాణం నిర్వహించుకునే గంద సముద్రవార్ ఎల్లప్ప (60)గా గుర్తించారు. మృతదేహన్ని చూసిన స్థానికులు ఎవ రో చంపి పడేసి ఉంటారనే అనుమానం వ్యక్తం చేశారు. అయితే బుధవారం రాత్రి బాసరలో భారీవర్షం కురిసి డ్రైనేజీలన్నీ పొంగి ప్రవహించాయి.బుధవారం బాసర సంత కావున మద్యంతాగి డ్రైనేజీ వర్షం నీటిలో పడి మృతిచెంది ఉంటాడనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నమని దర్యాప్తులో అన్నీ వివరాలు వెలుగులోకి వస్తాయని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుడిహత్నూర్ , జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఇంచార్జి ఎస్సై అంజమ్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వృద్ధులు ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కంటైనర్ వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో మహారాష్ట్ర సావిరి గ్రామానికి చెందిన గుట్టే బానుదాస్(75)అనే వృద్ధుడు సంఘటన స్థలంలో మృతిచెందాడు. అలాగే బోదిడికి చెందిన గుట్టే బాపురావ్ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. అతన్ని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కంటైనర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇంచార్జి ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

కడెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగలు తెగిపడటంతో షాక్‌కు గురై ఆవు మృతి చెందిన ఘటన కడెం మండలం గంగాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఆవు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. 50 వేల విలువైన ఆవు కోల్పోవడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మహిళతో అసభ్యంగా మాట్లాడిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అటెండర్స్ కాలనీలో నివాసం ఉండే ఓ మహిళతో వాట్సాప్ కాల్‌లో అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని పాఠన్ గ్రామానికి చెందిన గుంటిముక్కుల కరణ్ అనే యువకుడు తనతో అసభ్యంగా మాట్లాడారని సదరు మహిళ వన్‌టౌన్‌లో గత నెలలో ఫిర్యాదు చేశారు. మహిళ ఫిర్యాదు మేరకు విచారణ జరిపామని, కరణ్‌ను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అర్హులకు ఆహారభద్రత కార్డులు

● ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఉట్నూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నూతన ఆహారభద్రత కార్డులను మంజూరు చేస్తుందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. జిల్లా కలెక్టర్ రాజార్షిషా అధ్యక్షతన ఉట్నూర్ మండల కేంద్రంలోని హెచ్ కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఆహార భద్రత కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ మండలంలోని 2081 మందికి ఆహారభద్రత కార్డులు పంపిణీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందని, రేషన్‌కార్డులు ఉన్నవారికి పదిలక్షల ఆరోగ్య బీమా కల్పించామన్నారు. 500కి గ్యాస్ సబ్సిడీ, గృహలక్ష్మి, మహాలక్ష్మి లాంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ ప్రాంతంలో ఎస్సీ బీసీ రైతులు పోడు భూములు మూడు దశాబ్దాలకు ముందు నుంచి సాగు చేస్తున్నారని అలాంటి భూములలో అటవీ అధికారులు ప్లాంటేషన్ చేయడానికి ముందుకు వెళుతున్నందున జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని అటవీశాఖ అధికారులను సముదాయించాలన్నారు. లేనట్లయితే తానే ముందు ఉండి అటవీ అధికారులను అడ్డుకోవడం జరుగుతుందని అన్నారు. కవ్వాల్ టైగర్ జోనల్ రాకముందే ఎస్సీ బీసీ రైతులు పోడు వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. అటవీశాఖ అధికారులు మొక్కలు నాటే చర్యలకు పూనుకుంటే మరో గుండాల ముల్తానీల సంఘటన ముందుకు వస్తుందన్నారు. కొత్తగా అడవులను ఎవరు నరకవద్దని అలాంటి వారికి ప్రభుత్వం అండగా ఉండదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృశ్య కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజార్షి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో ప్రజా పాలన ప్రగతిశీలత బా ట కార్యక్రమం ద్వారా ఆహార భద్రత ఉత్తరేషన్ కార్డులు పంపిణీ చేస్తామని, జిల్లాలో ముందుగా ఉట్నూర్ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిసున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్యామలాదేవి, సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ అమృతలాల్, జిల్లా పౌరసరఫరాల అధికారివాజీద్ అలీ, డీటీ ప్రేమ్‌నివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం, వైస్‌చైర్మన్ జయవంతురావ్, డీసీసీబీ డైరెక్టర్ సామప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు ఆహార భద్రత కాలులను ఎమ్మెల్యే కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

యూరియా గోదాం తనిఖీ చేసిన కలెక్టర్

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో నిల్వచేసిన యూరియా నిలువలను జిల్లా కలెక్టర్ రాజార్షి షా పరిశీలించారు. గురువారం ఉట్నూర్ పర్యటనకు వచ్చిన కలెక్టర్ ముందుగా మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించి యూరియా నిలువలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, సింగిల్ విండో సీఈఓ మల్లయ్య పాల్గొన్నారు.

అమ్మ పేరిట మొక్క నాటి, సంరక్షించండి

ఖానాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అమ్మ పేరిట మొక్క నాటి ఆ నాటిన మొక్కను సంరక్షించేలా ప్రతి విద్యార్థి కృషిచేయాలని మస్కాపూర్ ప్రభుత్వఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోనగిరి నరేందర్ విద్యార్థులకు సూచించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పాఠశాల విభాగంలో నిర్వహిస్తున్న ఏక్‌పేడ్‌మాకేనామ్ 2.0 అనే ప్రత్యేక కార్యక్రమంలో తమ తల్లితో కలిసి మొక్క నాటుతూ విద్యార్థులు దిగిన ఫొటోను పాఠశాల లాగిన్ ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో పంపి దాని తాలూకు సర్టిఫికెట్‌ను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుర్రశేఖర్, వెఎన్నం అంజయ్య, రాపర్తి కిషన్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి



కుంటాలలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల, జూలై, 24 : (ఆంధ్రజ్యోతి) :యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పెన్షన్ ఉపాధ్యాయుల దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, జీవో నెంబరు 25 సవరించాలని, అందుబాటులో భాగంగా సర్దుబాటు చేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, ఏకీకృత సర్వీస్ నిబంధనలు అమలు చేసి అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లను లెక్చరర్‌గా పదోన్నతులు కల్పించాలని, పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేసిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ధర్మాజీ చందనే, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్ర నాగాకాంత్, టీఎస్ యూటీఎఫ్ సభ్యులు లక్ష్మణ్, రమేష్, రిటైర్డు ఉపాధ్యాయులు భీమ భూపతి తదితరులు పేర్కొన్నారు.

పండ్ల వ్యాపారులకు స్థలం కేటాయింపు

నిర్మల్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పండ్ల, వీధి వ్యాపారులకు పాత ఎమ్మార్వో స్థలమునకు మార్చేందుకు నిర్ణయించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పట్టణంలోని ధర్మసాగర్ చెరువు నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా గల పండ్ల, వీధి వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలోని బోయవాడ బస్‌డిపో, ఈద్‌గాం చేపల వ్యాపారులు కొత్తగా నిర్మించిన విశ్వేశ్వరయ్య మార్గ్‌నకు తరలించేందుకు వ్యాపారులు సహకరించాలని తెలిపారు.

రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా

నిర్మల్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్లపైన చెత్తవేసిన వారికి మున్సిపల్ అధికారులు జరిమానాలు విధించినట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. రోడ్లపై చెత్త వేస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వ్యాపారస్తులు రోడ్లపై చెత్త వేయకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుభాష్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ సాయికిరణ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు దేవదాస్, ప్రవీణ్‌కుమా ర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 8 పోస్టుల మంజూరు


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న అధ్యాపకులు

ముథోల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఖాళీగా ఉన్న 8 అధ్యాపక పోస్టులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేశారు. కళాశాలలో 200లకు పైగా విద్యార్థుల సంఖ్య ఉండడంతో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని ఇటీవల ముథోల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డిని కలిశారు. అదే విధంగా ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రాలను అందించారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించి 8 అధ్యాపక పోస్టులు మంజూరైనట్లు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ముథోల్ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్‌సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : సాత్నాల మండలం సైద్‌పూర్ పరిధిలోని ఇరవై గ్రామాల విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తుతోందని ఇటీవల గ్రామస్తులు ఫిర్యాదు అందించడంతో సి.ఈ జే.ఆర్ చౌహాన్ సాత్నాల సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రధాన కారణాలను గుర్తించారు. వినియోగదారులు విద్యుత్‌సరఫరాకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కి కాల్‌చేసి తెలుపాలని పేర్కొన్నారు.

బాధితులకు విశారదన్ మహరాజ్ పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి లేక దుబాయ్ వెళ్లి ప్రమాదంలో మరణించిన బొగడమీది సంతోష్ మృతికి ప్రభుత్వం సరైన జీవనోపాధి కల్పించకపోవడమే కారణమని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలంలోని టెంబుర్ని గ్రామం దుబాయ్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించిన బొగడమీది సంతోష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చేపలు పట్టి జీవనం సాగిస్తున్న సంతోష్‌కు ప్రభుత్వం సరైన జీవనోపాధి కల్పిస్తే దుబాయ్ దేశం వెళ్లి చనిపోయేవాడు కాదని ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో సరైన ఉపాధి అవకాశాలు లేకనే ఇక్కడి నుంచి చాలా మంది ప్రజలు గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది అన్నారు.

జనహృదయ నేత కేటీఆర్


ఖానాపూర్‌లో కేక్‌తినిపిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


కేక్‌కట్ చేస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పెర కృష్ణ

● కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్, జూలై 24 (ఆంధ్ర జ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వ కుంట్ల తారక రామారావు పుట్టిన రోజు వేడుకలను ఖానాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి, విద్యానగర్‌లో మొక్కలు నాటారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తాలో కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉచితంగా పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సక్కారం శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు రాజగంగన్న, పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, జిల్లా నాయకులు బీసీ రాజన్న, పుప్పాల గజేందర్, తోట సుమిత్, డాక్టర్ కేహెచ్ ఖాన్, చంద్రహాస్, అశోక్ రావు, ప్రకాష్, శేఖర్, ధర్మరాజు, సాడిగె ప్రసాద్, దివాకర్, అజయ్, మహిపాల్, మునుగూరి ప్రణీత్, తదితరులు న్నారు. తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై ఉన్న అభిమానంతో ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు అస్సాంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఖానాపూర్ నుంచి అస్సాం రాష్ట్రంలో కామాఖ్య అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొక్కుల ప్రదీప్, స్వర్ణకారుల సంఘం మాజీ అధ్యక్షులు కీసర రామచందర్, యువజన నాయకులు సతీష్ కుమార్‌లు గురువారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తానూర్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామరావు జన్మదినాన్ని గురువారం మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పెర కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు మండల కేంద్రం తానూర్‌లోని మహాలక్ష్మీ చౌక్‌లో కేక్‌కట్ చేసి టపాకాయలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. జన హృదయ నేత కేటీఆర్ అని ఈ సందర్భంగా పిప్పెర కృష్ణ అన్నారు. అనంతరం ఇటీవల ఉత్తమ పీఏసీఎస్ అవార్డు అందుకున్న సొసైటీ చైర్మన్ నారాయణ్‌రావుపటేల్, సీఈవో భూమయ్య, ఏడీసీసీ మేనేజర్ శ్రీకాంత్‌లను సన్మానించి వారిని అభినందించారు. అదే విధంగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై షేక్ జుబేర్, ఎంపీడీవో నసురోద్దిన్, తహసీల్దార్ మహేందర్‌లను సన్మానించారు.

హ్యామ్ రోడ్లకు గ్రీన్ సిగ్నల్..

(5వ పేజీ తరువాయి)

మండలం పాత నేషనల్ హైవే నుంచి మహబూబ్ ఘాట్ నిర్మల్ జిల్లా సరిహద్దు వరకు రెండు వరుసల రహదారిని నిర్మించనున్నారు. దాదాపుగా మూడు విడతల్లో జిల్లాలోని గ్రామీణ రోడ్లు అన్నింటిని పూర్తిచేసేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. హ్యామ్ విధానం ద్వారా జిల్లాలో మొదటి సారిగా రోడ్ల నిర్మాణ పనులను చేపట్టనున్నారు.ఈ రోడ్లపై ప్రైవేట్ కంపెనీలు టోల్ వసూలు చేయకుండా ప్రభుత్వమే విడతల వారీగా వ్యయాన్ని భరించనుంది. జిల్లాలో ఈ విధానం సక్సెస్ అయితే మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

సేవానిరతి చాటుకున్న ఎన్ఆర్ఐ

నర్సాపూర్(జి), జూలై 24 (ఆంధ్రజ్యోతి) : విదేశాల్లో ఉన్నా తన మాతృభూమిపై ప్రేమను, సేవానిరతిని చాటుకున్నాడు ఓ ఎన్ఆర్ఐ. తురాటి గ్రామానికి చెందిన సట్ల చిన్న రాజేశ్వర్ ఇటీవల రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిరంజీవి (చిరు) చంద్ర కుటుంబానికి తనవంతు సహాయంగా రూ. 10 వేల నగదును పంపించారు. తురాటి గ్రామానికి చెందిన చిరంజీవి చంద్ర ఇటీవల లోలం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దుబాయ్‌లో స్థిరపడిన సట్ల చిన్న రాజేశ్వర్ వెంటనే స్పందించాడు.

ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇసారపు నవీన్

ఖానాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖానాపూర్ మండలం గోసంపల్లి గ్రామానికి చెందిన ఇసారపు నవీన్ ఎన్నికయ్యారు. బుధవారం నిర్మల్‌లో నిర్వహించిన ఆ సంఘం జిల్లా ఎన్నికల్లో తనతో పాటు ఖానాపూర్‌కు చెందిన పలువురికి పదవులు దక్కినట్లు నవీన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా తర్లపాడ్ గ్రామానికి చెందిన పెద్ది నర్సయ్య, ముఖ్య సలహాదారులుగా ఎలిగేటి మల్లేష్, బొంగోని సురేష్ గౌడ్‌లు ఎన్నికైనట్లు నవీన్ పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తామని నవీన్ పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్

సోన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్దులకుంట ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపైన బాలశక్తిలో భాగంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పవన్, భరత్ కుమార్, ఉపప్రధానోపాధ్యాయు చంద్రశేఖర్ రావు, ఉపాధ్యాయులు టి. నరేందర్, భూమారెడ్డి, బి. నరేందర్, కడారి దశరథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

కుంటాల, జూలై, 24 (ఆంధ్రజ్యోతి) : హరితహారం కార్యక్రమంలో బాగంగా నాటిన ప్రతిమొక్కను సంరక్షించాలని ఎక్సైజ్ ఎస్సై అభిషేఖర్ అన్నారు. గురువారం కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో పోచమ్మ చెరువు కట్టపై ఈత మొక్కలు నాటారు. సిబ్బంది ఇర్ఫాన్, వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ యోగేష్, ఎఫ్ఏ వాణి, స్థానికులు శ్రీనివాస్ గౌడ్, శరత్ గౌడ్, రాజు గౌడ్ పాల్గొని నాటిన ఈ కార్యక్రమంలో భాగంగా చెరుకట్టపై వెయ్యిమొక్కలు నాటడమే లక్ష్యమని ఇందులో భాగంగా మొదటి విడతగా గురువారం 200 మొక్కలు నాటడం జరిగిందని త్వరలోనే మిగితా మొక్కలు నాటారని పేర్కొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న గిరిజీ మహరాజ్

బాసర, జూలై24 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారిని గురువారం అవధేశానంద్ గిరిజీ మహారాజ్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు సాదరస్వాగతం పలికరు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వారం రోజుల పాటు కొనసాగే భాగవత కథ సప్తాహ ప్రవచన కార్యక్రమానికి హాజరైన మహారాజ్ అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయఅర్చకులు తెలిపారు.

వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ముథోల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వీఆర్ఏ స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ గురువారం ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీలతకు వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. 2020 సెప్టెంబరు 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్ఏలకు పే స్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని, కానీ నేటి వరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20,555 మంది వీఆర్ఏల్లో డిగ్రీ చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్‌గా, ఇంటర్ చేసిన వారికి రికార్డు అసిస్టెంట్‌గా పదోతరగతి లోపు చదివిన వారిని ఆఫీస్ సబార్డినేటర్‌గా రెవెన్యూ శాఖలతో పాటు మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్య, వైద్య శాఖలలో చేర్చారన్నారు. కార్యక్రమంలో నవీన్, ముత్యం, భూమన్న, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కూల్‌బ్యాగ్స్ పంపిణీ

భైంసా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత విద్యా విలీన కేంద్రంలో గల దివ్యాంగులకు గురువారం బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి పడకంటి రమాదేవి స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం వేళలో ఇక్కడి భవిత విలీన విద్యా కేంద్రాన్ని పడకంటి రమాదేవి నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధులను సందర్శించింది. ఈ సందర్భంగా కేంద్రంలోని దివ్యాంగులకు పండ్లు, స్కూల్ బ్యాగ్స్‌ను పంపిణీ చేశారు. ఇందులో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు కడెంలో జిల్లా కలెక్టర్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం పర్యటన

కడెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీలో, కడెం మండల కేంద్రంలో శనివారం జిల్లా పాలన అధికారి, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం పర్యటిస్తున్నారని కడెం తహసీల్దార్ ఓ ప్రకటనలో తెలిపారు.

28న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఒప్పంద ప్రతిపాదన పోస్టుల ఇంటర్వ్యూ

నిర్మల్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఒప్పంద ప్రతిపాదన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు వైద్యాధికారుల పోస్టులు, బస్తీ దవాఖానలో రెండు వైద్యాధికారుల పోస్టుల భర్తీకి ఈ నెల 28న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో వాకింగ్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పత్రిక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని తగిన అర్హత పత్రాలతో హాజరు కాగలరని తెలిపారు.

నేడు పెన్షనర్ల జిల్లా కౌన్సిల్ సమావేశం

నిర్మల్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కౌన్సిలర్ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు ఎన్‌సీ లింగన్న తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హెల్ప్ ఏజ్ ఇండియా వారిచే వయోవృద్ధుల సంరక్షణ చట్టం, సైబర్ నేరాల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధి శ్యామ్‌చే అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా సీనియర్ సివిల్ జడ్జి రాధిక, జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరవుతున్నట్లు తెలిపారు.

కాంబోడియాలో సైబర్ మోసాలు..

105 మంది భారతీయుల అరెస్టు

- 138 ప్రాంతాల్లో కాంబోడియా పోలీసుల దాడులు
- 3,075 మంది అనుమానితుల పట్టివేత

న్యూఢిల్లీ, జూలై 24: కాంబోడియా కేంద్రంగా చైనా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తున్న కాల్ సెంటర్లపై అక్కడి పోలీసులు దాడులు జరిపారు. 15 రోజుల పాటు.. 138 ప్రాంతాల్లో జరిపిన ఈ దాడుల్లో మొత్తం 3,075 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వీరిలో 105 మంది భారతీయులున్నారు. నిజానికి భారతీయులను ఉద్యోగాల పేరుతో కాంబోడియా, మయన్మార్ వంటి దేశాలకు తీసుకెళ్తున్న చైనా సైబర్ కేటుగాళ్లు.. వారిని అక్కడ నిర్బంధిస్తున్నారు. బలవంతంగా సైబర్ నేరాల కాల్ సెంటర్లు నిర్వహించేలా చేస్తున్నారు. మాట వినకుంటే.. కరెంటు షాకులివ్వడం, తిండితిప్పలు లేకుండా చేస్తూ.. హింసిస్తున్నారు. దీనిపై భారత ప్రభుత్వం పలు దఫాలుగా కాంబోడియా ప్రభుత్వంతో చర్చించింది. ఈ క్రమంలో కాంబోడియా పోలీసులు ఈ దాడులు జరిపారు. అరెస్టయిన వారిలో భారతీయులతోపాటు.. వివిధ దేశాల పౌరులు ఉన్నారు. కాగా.. ఈ దాడుల్లో అరెస్టయిన 105 మంది భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్ర హోంశాఖ చర్యలను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

అమెరికాలో భారీగా పడిపోయిన జననాల రేటు

న్యూయార్క్, జూలై 24: అమెరికాలో సంతానోత్పత్తి దారుణంగా పడిపోతోంది. గతంలో ఎప్పుడూ లేనంత తక్కువగా గత ఏడాది జననాల రేటు నమోదైంది. 2024కు సంబంధించి వ్యాధి నియంత్రణ, నివారణ సెంటర్లు (సీడీసీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో సంతానోత్పత్తి తగ్గిపోయిన విషయం స్పష్టమైంది. జనాభా భర్తీ రేటు ప్రకారం సగటున ప్రతి మహిళకు 2.1 కంటే ఎక్కువగా పిల్లలు ఉండాల్సిన తరుణంలో.. అమెరికాలో జననాల రేటు 1.6 కంటే తక్కువగా నమోదైందని సీడీసీ వెల్లడించింది. 1960ల్లో యూఎస్‌లో జననాల రేటు సుమారు 3.5గా ఉంది. ఆ తర్వాత నుంచి క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. జననాల రేటు తగ్గిపోతోందన్న హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం సంతానోత్పత్తిని పెంచడానికి ఇటీవల చర్యలు చేపట్టింది.

గర్భిణి అనుమానాస్పద మృతి

- భార్య మృతదేహంతో 3 రోజులు ఇంట్లోనే భర్త
- స్థానికులు గమనించడంతో పరారీ

బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలోని హెణ్ణూరు థణిసంద్రలో ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతదేహంతో భర్త ఇంట్లోనే మూడు రోజులపాటు గడిపాడు. ఆ ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించారు. దీంతో బుధవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం, ఆయన భార్య సుమన్ ఆ ఇంట్లో నివసించేవారు. శివం పెయింటింగ్ పనులు చేసేవాడు. మూడురోజుల కిందట సుమన(22) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆ రోజు శివం పనుల కోసం బయటకు వెళ్లాడు. భార్య మృతిచెందాక పనులకు వెళ్లాడా, ఆయన వెళ్లాక ఆమె మృతిచెందిందా అన్నది స్పష్టత లేదు. కానీ ఆ మరుసటి రోజు భార్య మృతదేహం వద్దే శివం గడిపినట్టు, అక్కడే మద్యం సేవించి, భోజనం చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. మూడో రోజు బుధవారం ఇంటి నుంచి దుర్వాసన రావడం మొదలైంది. దీంతో స్థానికులు ఆ రోజు మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లగా.. శివం ఒక్కసారిగా అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే వారు హెణ్ణూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సుమన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, శివం కోసం గాలిస్తున్నారు. సుమన మృతికి కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

అనిల్ అంబానీ సంస్థలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ, జూలై 24: మూడువేల కోట్ల రూపాయల బ్యాంకు రుణ మోసం, నగదు అక్రమ చలామణీ కేసు దర్యాప్తులో భాగంగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కంపెనీలు, ఎస్ బ్యాంకుకు చెందిన 35 కార్యాలయాలపై దాడులు చేశారు. నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం కింద 25 మందిని ప్రశ్నించారు. ఆయా కార్యాలయాల నుంచి పలు పత్రాలు, కంప్యూటర్ ఉపకరణాలను (ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌ల వంటివి) స్వాధీనం చేసుకున్నారు. 2017-2019 మధ్య 'ఎస్ బ్యాంకు' అధికారులకు రిలయన్స్ గ్రూపు కంపెనీలు లంచాలు ఇచ్చి.. ఆ బ్యాంకు నుంచి రూ.3000 కోట్ల మేర రుణాలు పొంది, ఆ రుణాలను అక్రమంగా దారి మళ్లించాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఆ రుణాల మంజూరుకు ఎస్‌బ్యాంకు వర్గాలు పలు నిబంధనలను ఉల్లంఘించాయని.. పాత తేదీతో రూపొందించిన రుణ మంజూరు గుర్తింపు పత్రాలను ఉపయోగించాయని.. మంజూరైన రుణాలను రిలయన్స్ గ్రూప్‌లోని పలు ఇతర సంస్థలకు, షెల్ కంపెనీలకు మళ్లించారని ఆరోపణలు రావడంతో.. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) 2022 సెప్టెంబరులో రెండు కేసులు నమోదు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ ఎస్ బ్యాంకు సహ వ్యవస్థాపకుడు, ఆ బ్యాంకు మాజీ ఎండీ రాణా కపూర్ పేరును సీబీఐ ప్రస్తావించింది. సీబీఐ పెట్టిన రెండు కేసులతోపాటు.. ఈ వ్యవహారానికి సంబంధించి నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. బ్యాంకులను, షేర్‌హోల్డర్స్‌ను, ఇన్వెస్టర్లను, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేసి ప్రజాధనాన్ని దారి మళ్లించడానికి పక్కా ప్రణాళికతో ఈ ఫ్రాడ్‌కు రూపకల్పన చేసినట్టు ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అప్పట్లో రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు రుణం మంజూరు కావడానికి ముందే.. ఎస్ బ్యాంకు ప్రమోటర్లు 'నగదు (లంచం)' అందుకున్నట్టుగా ఈడీ తన ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిందని విశ్వసనీయవర్గాల సమాచారం. ఎస్‌బ్యాంకు వద్దే కాదు.. కెనరా బ్యాంకు వద్ద సైతం ఆర్‌కామ్ ఇదే తరహాలో లంచాలిచ్చి రూ.1050 కోట్లకు పైగా రుణాలను పొందిన వైనంపైనా ఈడీ దృష్టి పెట్టినట్టు సమాచారం. రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థ బ్యాంకులు జారీ చేసే ఏటీ-1 (అడిషనల్ టైర్-1) బాండ్లలో రూ.2850 కోట్ల దాకా పెట్టుబడి పెట్టిందని.. అందుకు బదులుగా ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని ('క్విడ్ ప్రో కో'గా) ఈడీ భావిస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. కాగా.. ఈడీ సోదాలతో తమ వ్యాపార కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావమూ పడలేదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీలు వేర్వేరు ప్రకటనలు చేశాయి. ఈడీ సోదాలకు సంబంధించి మీడియా కథనాల్లో పేర్కొంటున్న ఆరోపణలు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) లేదా రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) పదేళ్ల క్రితం జరిపిన లావాదేవీలకు సంబంధించినవని వెల్లడించాయి.

ఇదేం తీర్పు?

- నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం



బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ మంజూరుచేసిన హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహించింది. 'వివేకాన్ని వాడే హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చిందా?' అని ఘాటుగా ప్రశ్నించింది. న్యాయ విచక్షణాధికారం తీవ్రంగా దుర్వినియోగం అయిందని వ్యాఖ్యానించింది. బెయిల్ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రిజర్వులో ఉంచింది. 'ఇలాంటి కేసుల్లో బెయిల్ ఇవ్వవచ్చా? హైకోర్టు చేసిన తప్పునే మేం కూడా చేయదలుచుకోలేదు. బెయిల్ తీర్పును ఇచ్చేముందు విచక్షణాధికారాన్ని కోర్టు ఉపయోగించిందో లేదో పరిశీలించాలని అనుకుంటున్నాం. అందువల్ల పిటిషన్‌పై తొందరపడి తీర్పు ఇవ్వడంగానీ, విడుదలకు లేక శిక్షలకు ఆదేశాలు ఇవ్వడంగానీ చేయబోం" అని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా.. దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ ఇచ్చిన తీరును బెంచ్ తప్పుబట్టింది. "ప్రతి బెయిల్ తీర్పును హైకోర్టు ఇలాగే రాస్తుందా? ఈ కేసును హైకోర్టు చూసిన దృష్టి ఎక్కువగా మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. సెషన్స్ కోర్టు జడ్జి అయితే అర్థం చేసుకోవచ్చు. కానీ, హైకోర్టు న్యాయమూర్తి ఇలాంటి పొరపాటు చేయడమేంటి? ఇంతేనా జడ్జి అవగాహన?. ఇది కుట్ర, హత్యలకు సంబంధించిన కేసు కావడంతో మా స్వరం కొంచెం కటువుగానే ఉంటుంది." అని బెంచ్ తెలిపింది. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, నటి పవిత్రాగౌడ, ఇతర నిందితులకు గత ఏడాది డిసెంబరు 13న కర్ణాటక హైకోర్టు బెయిల్ ఇచ్చింది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా ఈ కేసులో పవిత్ర పాత్రపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. "అంతా మీవల్లే జరిగింది. మీరు అక్కడ లేకపోతే ఏ2 పట్టించుకునేవారుకాదు. ఏ2 స్పందించకపోతే మిగతావారూ పట్టించుకునేవారు కాదు. మొత్తం సమస్యకు మీరే కారణం." అంటూ ఆగ్రహించింది. దీనిపై పవిత్ర తరఫు న్యాయవాది స్పందిస్తూ.. "ఆమెకు (రేణుకాస్వామి నుంచి) అభ్యంతరకర మెజేస్‌లు వచ్చేవి. నేరుగా మాట్లాడిన కాల్ రికార్డులు లేవు. అపహరణ, హత్యతో ఆమెకు సంబంధం ఉన్నట్టు ఆధారాలు లేవు" అని వాదించారు. అయితే, తాము వాదనల లోతుల్లోకి వెళ్లదలుచుకోలేదని బెంచ్ స్పష్టం చేసింది. గార్డులు కిరణ్, పునీత్‌ల వాంగ్మూలాలను హైకోర్టు ఎందుకు తిరస్కరించిందని బెంచ్ నిలదీసింది. కర్ణాటక ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. కాల్ డేటా రికార్డులు, లొకేషన్ పిన్‌లు, దుస్తులపై, వాహనంలో దొరికిన డీఎన్ఏ, ఇతర ఆధారాలు వారిద్దరి వాంగ్మూలాలను ధ్రువీకరించాయని వాదించారు. సాక్ష్యాధారాల తీరుపై బెంచ్ పలు ప్రశ్నలు సంధించింది. "నిందితుల నుంచి మీరు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దాడి దృశ్యాలను దానిలో ఎలా బంధించారు?." అని ప్రశ్నించింది. దీనికి లూథ్రా బదులిస్తూ.. దాడి ఫొటోలు ఏ2కు ఫార్వర్డ్ అయ్యాయని, తనను కొట్టవద్దు అని హతుడు వేడుకొంటుండగా తీసిన ఫొటో కూడా అందులో ఉన్నదని తెలపగా, బెంచ్ విస్మయానికి గురయింది. "ఒకవైపు కొడుతున్నారు.. మరోవైపు ఫొటోకు పోజు ఇస్తున్నారు.. నిజంగా నమ్మలేకపోతున్నాం." అని వ్యాఖ్యానించింది. వారు తమ అభిమాన నటుడి కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉండే దర్శన్ అభిమాన సంఘానికి చెందినవారని లూథ్రా వివరించారు. "ఇదో కిరాతక హత్య. సోషల్ మీడియాలో పోస్టు చేశారనే కారణంగా రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి కిరాతకంగా హతమార్చారు. నిందితులు దర్శన్, పవిత్రగౌడ సహా అందరి కండిషన్ బెయిల్‌ను రద్దు చేయాలి" అని ఆయన కోరారు. కాగా, దర్శన్ తరఫు న్యాయవాది కపిల్‌సిబల్ మరో కేసును వాదించేందుకు వెళ్లడంతో లిఖితపూర్వక వాదనల కోసం వారంరోజుల గడువు ఇస్తున్నామని బెంచ్ తెలిపింది. దీంతో బెయిల్ రద్దు కావచ్చునని నిందితులలో భయం పట్టుకుంది. నిందితులకు వ్యతిరేకంగానే తీర్పు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. 'డెవిల్' సినిమా షూటింగ్ కోసం నటుడు దర్శన్ థాయ్‌లాండ్‌కు వెళ్లిన విషయం తెలిసిందే.

నకిలీ ఓట్లను అనుమతించేదే లేదు

- ఓటర్ల తొలగింపు అబద్ధం: సీఈసీ
- బిహార్‌లో ప్రత్యేక సవరణకు సమర్థన

న్యూఢిల్లీ, జూలై 24: బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్)ను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ గట్టిగా సమర్థించుకున్నారు. నకిలీ ఓటర్లు ఓటేయడానికి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో అసలైన ఓటర్లను తీసివేస్తున్నామన్న విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చేయబోతున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. అయితే కర్ణాటకలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని.. నూరు శాతం రుజువులున్నాయని.. ఒక నియోజకవర్గంలో వందలు, వేల అదనపు ఓటర్లను చేర్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే నిరాధార ఆరోపణలు చేయొద్దని, రాజ్యాంగ సంస్థను బెదిరిస్తున్నారని ఈసీ ఆక్షేపించింది. కాగా, బిహార్లో ప్రత్యేక సవరణను నిరసిస్తూ ఇండియా కూటమి ఎంపీలు గురువారం పార్లమెంటు ద్వారం వద్ద వరుసగా నాలుగో రోజూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రాహుల్ ఈసీపై విరుచుకుపడ్డారు. కర్ణాటకలో ఓ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై 90 శాతం కాదు.. నూరు శాతం రుజువులు చూపిస్తామని తెలిపారు. అయితే.. రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. నిరాధార ఆరోపణలు చేయడమే గాక.. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను ఆయన బెదిరిస్తున్నారని విమర్శించింది.

జడ్జిల నియామకంలో జాప్యంపై విచారణ

- రెండు వారాల తర్వాత చేపట్టనున్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 24: జడ్జిల నియామకంపై కొలీజియం చేస్తున్న సిఫార్సులను ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపేందుకు గురువారం సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. రెండు వారాల తరువాత విచారణ చేపడుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్లను 2023లోనే లిస్టు చేశారని, అనంతరం ఆకస్మికంగా వాటిని జాబితా నుంచి తొలగించారని సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రాధిక

కుభీర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా సెషన్ కోర్టు న్యాయాధికారి రాధిక సూచించారు. గురువారం మండలంలోని డొడర్న సాయినగర్ తండాలో నల్సా సంవాద్ స్కీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. గిరిజనులకు ప్రభుత్వం మంజూరుచేస్తున్న సంక్షేమ పథకాలు విద్యా, వైద్యం వారికి ఉన్న హక్కులు, వసతులపై మానిటరింగ్ చేసేందుకు జిల్లాలోనే గిరిజనులు అధికంగా ఉన్న కుభీర్ మండలంలోని డొడర్న సాయినగర్ తండాను మొదటగా ఎంచుకున్నామన్నారు. అన్నిమండలాల నివేదికలను రూపొందించి తమపై అధికారులకు జిల్లా కలెక్టరుకు అందిస్తామన్నారు. అవగాహన సదస్సులో రైతుల సాగు చేస్తున్న పంటల వివరాలను తెలుసుకున్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించి రశీదు పొందాలన్నారు. అనంతరం డొడర్న రామ్‌నాయక్ తండాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కుభీర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రి చుట్టూ ప్రహరీ నిర్మాణం, ప్రసవాలు, కుటుంబ నియంత్రణ, డయాలసిస్‌సేవలు అందించేలా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, ఏవో సారిక, స్థానిక ఎస్సై కృష్ణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై తొలగని సందిగ్ధత



జిల్లాలో యూరియా సరఫరాపై రైతుల్లో సందిగ్ధత నెలకొంది. యూరియా అందుబాటులో ఉందని అధికారులు ఓ వైపు ప్రకటిస్తున్నా సరఫరాలో మాత్రం ఇబ్బందులు తప్పడంలేదు. గురువారం పీఏసీఎస్ ద్వారా రైతులకు యూరియా బస్తాలు అందజేయగా వర్షం కారణంగా రైతులు అధికసంఖ్యలో రావడంతో వారిని క్యూలో ఉంచి టోకెన్లు అందించారు. అయితే స్టాక్ అందుబాటులో ఉందని, రైతులుతప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని అధికారులు చెబుతుండగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో యూరియా కోసం క్యూలో నిలబడడం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోయారు.

● ఆంధ్రజ్యోతి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్ / ఉట్నూర్

రోడ్డుపైనే వ్యర్థాలు!

● దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు

ఆదిలాబాద్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నుంచి కచ్ కంటివెళ్లే మార్గమధ్యంలో ఎరోడ్రమ్ వద్ద రోడ్డు చెత్త, జంతు వ్యర్థాలను పడేయడం తో ఆ ప్రాంతమంతా కంపుకొడుతోంది. డంపింగ్ యార్డుగా మారిన ఆ ప్రాంత నుంచి అటుగా వెళ్తున్న ప్రజలు దుర్వాసనను భరించలేకపోతున్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్న నేపథ్యంలో ప్రధానరహదారిపై చెత్తపేరుకుపోవడం విమర్శలకు తావిస్తోంది. వెంటనే చెత్త, జంతు కళేబరాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎరోడ్రమ్ వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెత్త

గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరద



గడ్డెన్న వాగు ప్రాజెక్టు

భైంసా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల మూలంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక మొదలైంది. గురువారం ప్రాజెక్టులోకి 324 క్యూ సెక్కుల వరద నీరువచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు, 1.83 టీఎంసీలు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 355.8 మీటర్లు ఉండగా 0.185 టీఎంసీల నీటి నిల్వఉంది. ప్రాజెక్టు ఎగువభాగంలో వర్షాలుకురుస్తున్న నేపథ్యంలో వరద చేరిక కొనసాగుతోంది. ప్రస్తుత వానాకాలపు సీజన్‌లో ప్రాజెక్టులోకి ఇంతవరకు 0.185 టీఎంసీల వరద వచ్చి చేరింది.

నిండు కుండలా కడెం ప్రాజెక్టు

కడెం: జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతుల వరప్రదాయిని కడెం ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 2,429 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 700 అడుగులుకాగా ప్రస్తుతం 695.250 ఉందన్నారు. లెఫ్ట్, రైట్ కెనాల్ ద్వారా మిషన్ భగీరథకు మొత్తం కలిపి 773 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

శుభప్రదం.. శుభకర శ్రావణం

● శ్రావణ మాసం పవిత్ర మాసం ● నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం



ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయం

ముథోల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో ప్రతీ ఇల్లూ ఆలయాన్ని తలపిస్తుంది. నెలరోజుల పాటు ఉదయం, సాయంత్రం భగ వన్నామస్మరణంతో మార్మోగుతాయి. 25 శుక్రవారం నుంచి శ్రావణ మా సం ప్రారంభమవుతుంది. ఈ నెలలో ఎన్నో మంచి రోజులు విశిష్ట పం డుగలు రానున్నాయి. వర్షరుతువు ప్రారంభమవుతుంది. త్రిమూర్తులలో స్థితికారుడు దుష్ట శిక్షకుడు శిష్ట రక్షకుడైన మహావిష్ణువుకు ఆయన దేవేరి మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసంగా చెప్పుకుంటారు. పూజలు, వ్రతాలు ఆచరించడం వల్ల ఫలితాలు ప్రసాదించే దివ్యమైన మాసంగా పెద్దలు చెప్పుకుంటారు. మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రావణ నక్షత్రం కావడం అటువంటి పేరులలో ఏర్పడిన శ్రావణ మాసం మహా విష్ణువు పూజకు ఎంతో అనుకేలమైనది.

శివ ఆరాధనకు ఎంతో విశిష్టత

దక్షిణ యానంలో వచ్చే విశిష్టమైన మాసాల్లో శ్రావణ మాసం ఒకటి. శివ పూజకు విశిష్టమైనదని, భగవద్ధారణలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది ఏ చిన్న దైవ కారణమైన ఎంతో శుభ ఫలితాన్ని ఇస్తుందని ప్రతీతి. సోమవారాలు పగలంతా ఉపవాసం ఉండి రాత్రివేళల్లో స్వామివారికి రుద్రాభిషేకం బిల్వర్చనలు చేస్తే పుణ్యం కలు గుతుందని శాస్త్ర వచనం శ్రావణమాసం ఎంతో విశిష్టత కలిగి ఉంది. శుక్లపక్ష ద్వాదశి దామోదర ద్వాదశి అని ఈ మాసంలో రెండు శుభదినాలు ఉన్నాయి. శుక్లపక్ష ఏకాదశి నాడు ఉపవాసం ఉండి మహావిష్ణువుకు పూజించినట్లయితే మోక్షం లభిస్తుందని చాలామంది భక్తులు విశ్వసిస్తున్నారు.

7

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 । కనిష్ఠం 24.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

» జిల్లాలో ఆర్ అండ్ బీ పరిధిలో 176 కిలో మీటర్లు రోడ్ల అభివృద్ధికి ఆమోదం

» పంచాయతీరాజ్ పరిధిలో 347.40 కిలో మీటర్లు రోడ్లకు ప్రతిపాదనలు

» ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతో పనుల నిర్వహణ

» గ్రామం నుంచి మండలం, జిల్లా కేంద్రాలకు లింక్ రోడ్లు

» గ్రామీణ రోడ్ల విస్తరణ, అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

హ్యామ్ రోడ్లకు గ్రీన్ సిగ్నల్



ఆదిలాబాద్, జూలై24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానం ద్వారా జిల్లాలోని గ్రామీణ రోడ్ల విస్తరణ, అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ పడింది. 2025-26లో మొదటి విడత కింద చేపట్టే ఆర్అండ్‌బీ పరిధిలోని 10 రోడ్లకు 176 కిలో మీటర్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే పంచాయతీ రాజ్ పరిధిలోని మొత్తం 85 రోడ్లకు 347.40 కిలోమీటర్ల అభివృద్ధికి ఆమోదం తెలపాల్సి ఉంది. హ్యామ్ విధానం ద్వారా మూడు దశల్లో రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. రాబోయే మూడేళ్లలో జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేసేవిధంగా ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ అధికారులు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. దీంతో గ్రామీణ రోడ్లు మరింత మెరుగుపడి రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

జిల్లాలో చేపట్టే పనులు ఇవే..

హ్యామ్ విధానం ద్వారా జిల్లాలో మొదటి విడత కింద చేపట్టే కొన్ని ముఖ్యమైన పనుల వివరాలు.. ఆర్ అండ్ బీ పరిధిలో అదిలాబాద్ నియోజకవర్గంలోని జైనాథ్ మండలం మండలం క్రాసి ఎక్స్ రోడ్ వయా బాలాపూర్, సవాపూర్, పెండల్వాడ, కౌట, ఆనందపూర్, కూర గ్రామాల మీదుగా (25 కిలోమీటర్‌లు), ఆదిలాబాద్ టు కేరమెరి (42 కిలో మీటర్లు) ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని నార్నూర్ మండలంలో ఆదిలాబాద్ టు కెరమెరి (13.6 కిలో మీటర్లు), బోథ్ నియోజక వర్గంలోని నేరడిగొండ మండలం పాత నేషనల్ హైవే టు మహబూబ్ ఘాట్ (10.4 కిలోమీటర్లు), ఇచ్చోడ టు సిరిచెల్మ (16 కిలో మీటర్లు), ఆదిలాబాద్ టు తలమడుగు (23.3 కిలోమీటర్లు) గుడిహత్నూర్ టు ఉట్నూర్ (7.4 కిలో మీటర్లు), ఖానాపూర్ నియోజకవర్గంలో గుడిహత్నూర్ టు ఉట్నూర్ (28.2కిలోమీటర్లు) ఉట్నూర్ టు ఆసిఫాబాద్ (8.0 కిలో మీటర్లు) ఉట్నూర్ టు ఇంధన్‌పల్లి వయా దంతాన్ పల్లి బీర్సాయిపేట్ (2 కిలోమీటర్లు) పంచాయతీ రాజ్ పరిధిలో తలమడుగు మండలం ఉండం టు సఖినాపూర్ (8.5 కిలో మీటర్లు), తాంసి మండలం పోచ్చార టు జామిడి (5.0 కిలో మీటర్లు)



ఇచ్చోడ టు సిరిచెల్మ రోడ్డు మార్గం

ఆర్అండ్‌బీ ఎక్స్ రోడ్ అత్నంగూడా (5.0 కిలో మీటర్లు) సిరికొండ మండలం ఆర్ఎంబీ ఎక్స్ రోడ్‌పల్లి (5.4 కిలో మీటర్లు) నేరడిగొండ మండలం ఎన్‌హెచ్ 44 టు బోందిడి వయా వడూర్ (8.2 కిలోమీటర్లు) మేరా రోడ్డు నిర్మాణ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో విడతల వారీగా పనులు పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నిధుల సమస్య ఉండదిక..

ఇప్పటి వరకు ఆన్ లైన్ టెండర్ల ద్వారా చేపట్టిన రోడ్ల పనుల విషయంలో తరచూ నిధుల సమస్య తలెత్తడంతో పనులను చేపట్టేందుకు ఆటంకాలు ఎదురయ్యేవి. ఇకపై హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే పనులకు సమస్యలు ఉండవని అధికారులు చెబుతున్నారు. ఎందుకంటే పనులను దక్కించుకున్న కాంట్రాక్టు కంపెనీకి ప్రభుత్వం మొత్తం అంచనా వ్యయంలో నుంచి ముందుగానే 40 శాతం నిధులను చెల్లిస్తుంది. పనులు పూర్తయిన తర్వాత 15 ఏళ్ల పాటు మిగతా 60 శాతం నిధులను విడతల వారిగా చెల్లించేలా ఒప్పందం ఉంటుంది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ బిల్లులు కోసం ఎదురుచూసే అవకాశమే ఉండదంటున్నారు. అలాగే ఈ విధానం ద్వారా నాణ్యమైన రోడ్డు నిర్మాణ పనులను చేపట్టేందుకు వీలు ఉంటుందని పేర్కొంటున్నారు.

ప్రాధాన్యత క్రమంలో పనులు..

ప్రాధాన్యత క్రమంలో రోడ్లనిర్మాణ, విస్తరణ పనులను చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు , జిల్లా కేంద్రాలకు లింక్ రోడ్లను నిర్మించేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. కొత్త రోడ్ల నిర్మాణంతోపాటు ఇప్పటికే ఉన్న రోడ్లను విస్తరించడం మరింత అభివృద్ధి చేయడం లాంటి పనులను చేపట్టనున్నారు. నేరడిగొండ (మిగతా 6లో..)

మూడు విడతల్లో పనులను పూర్తి చేస్తాం..

• నర్సయ్య, ఆర్అండ్‌బీ ఈఈ, ఆదిలాబాద్

హ్యామ్ విధానం ద్వారా జిల్లాల్లో మూడు విడతల్లో పనులను పూర్తి చేస్తాం. ఆర్ అండ్ బీ పరిధిలో మొదటి విడత కింద 176 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ అభివృద్ధి పనులను చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇంకా పూర్తి స్థాయిలో విధివిధానాలు ఖరారు కావాల్సి ఉంది. ఈ విధానం ద్వారా పనులు వేగవంతం, నాణ్యతగా పూర్తయ్యే అవకాశం ఉంది. భారీ నిర్మాణ కంపెనీలు ఈ పనులను చేపట్టే అవకాశం ఉంది.

జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం

• అత్యధికంగా బేలలో 56.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఆదిలాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. అత్యధికంగా బేల మండలంలో 56.8 మి.మీ., జైనాథ్‌లో 50.5 మి.మీ., బజార్ హత్నూర్‌లో 39.5 మి.మీ., ఆదిలాబాద్ అర్బన్‌లో 35.1 మి.మీ., ఉట్నూర్‌లో 32.3 మి.మీ., సోనాలలో 31.5 మి.మీ., ఆదిలాబాద్ రూరల్‌లో 29.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా గుడిహత్నూర్ మండలంలో 12.2 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు కుంటలు ప్రాజెక్టుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా ప్రస్తుతం 285.15 మీటర్లకు చేరింది. అలాగే మత్తడి వాగు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 276.70 మీటర్లకు చేరుకుంది. ఏగువ ప్రాంతంనుంచి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరుతోంది. కుంటాల, పోచ్చర కనకాయి, గాయత్రి జలపాతాలు వరద నీటితో పరవాళ్లు పెడుతున్నాయి. జిల్లాలో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలకు మేలు చేసే విధంగా ఉన్నాయని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసరమైతే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి: ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, జూలై24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసరమైతే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలో రెండు రోజులుగా వానలు ఏకధాటిగా కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. నూతన డీడీఆర్ఎఫ్ బృందం ప్రతినిత్యం అందుబాటులో ఉంటుందని, లోతట్టు ప్రాంతాల ప్ర జలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం అన్నిపోలీస్‌స్టేషన్‌లలో అప్రమత్తతతో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. వర్షం భారీగా ఉన్నప్పుడు పొలాలలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకవద్దని పేర్కొన్నారు. యువకులు అత్యుత్సాహంతో ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతాలు, వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్‌లు, చెరువుల వద్దకు వెళ్లవద్దని కోరారు. ప్రమాద ప్రదేశాల్లో పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

ఆదర్శ పాఠశాలలోని పెండింగ్ పనులను పూర్తి చేయండి : ఎంపీడీవో

బోథ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీవో రమేష్ తెలిపారు. గురువారం మండలంలోని చింతగూడ నేరేడుపల్లి, మర్లపల్లి గ్రామాలలో పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

తాంసి, జూలై24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం అధికారులు పరిశీలించారు. గ్రామంలో ప్రస్తుతం 63 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల నిర్మాణాలు ఏ మేరకు నడుస్తున్నాయో సంబంధిత గ్రామ కార్యదర్శి లావణ్య లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణాల్లో ఎలాంటి అవకతవకలూ లేకుండా చేపట్టాలని ఆమె సూచించారు. త్వరితగతిన బిల్లులు కూడా మంజూరు అవుతాయని బిల్లల విషయంలో ఎలాంటి ఆందోళన గురికావద్దని ఆమె లబ్ధిదారులకు సూచించారు.

బాలికల ఉన్నత పాఠశాలలో 'జ్వాల' శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్, జూలై24 (ఆంధ్రజ్యోతి): బాలికలకు స్వీయ రక్షణలో శిక్షణ అందించేందుకు పోలీసుశాఖ నేతృత్వంలో ఇటీవల ప్రారంభించిన జ్వాల కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం బాలికలకు కరాటే, మార్షల్ ఆర్ట్స్‌పై మాస్టర్‌లు శిక్షణ అందించారు. శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మొక్కలు నాటిన ముక్రా(కె) గ్రామస్థులు

ఇచ్చోడ, జూలై24(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ముక్రా(కె) గ్రామస్థులు గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా గ్రామంలో 100 మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను రక్షిస్తామని మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, ఆసరా పెన్షన్‌దారుల సన్నాహక సభ వాయిదా

ఆదిలాబాద్‌టౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో ఈనెల 26న తలపెట్టిన దివ్యాంగులు, ఆసరా పెన్షన్‌దారుల సన్నాహక సభ అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు వీహెచ్‌పీఎస్ కల్లేపల్లి ప్రేమ్ రాజ్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్న సభ ఆగస్టు 4కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

రాజ్ గోండు సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

బోథ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ ఎంపీ సోయం బాబురావును గురువా రం ఆత్మ మాజీ చైర్మన్ జి.రాజు యాదవ్ శాలువాతో సన్మానించా రు. ఈ సందర్భంగా మాజీ ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ కొట్టాల గంగారెడ్డి, చిలుకూరి రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామిల్లిరాజన్న పాల్గొన్నారు.

నేటి నుంచి కజ్జర్లలో శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమం ప్రారంభం



అఖండజ్యోతి కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్న గ్రామస్థులు

తలమడుగు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కజర్ల గ్రామంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శబరిమాత అఖండజ్యోతి కార్యక్రమాన్ని ఈనెల 25 నుంచి నెల రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. నెలరోజుల పాటు ప్రతిరోజు దీప దూపజప కార్యక్రమాలతో పాటు భజన కార్యక్రమాలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతున్నాయని అన్నారు. కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్ యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శబరిమాత భక్తుడు అధిక సంఖ్యలో పాల్గొన్న విజయవంతం చేయాలని గ్రామస్థులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

• కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, చదువుతోపాటు వృత్తి నైపుణ్య శిక్షనపై సైతం దృష్టి సారించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణసంస్థ, శ్రీ షిరిడి సాయి సేవా సొసైటీలు సంయుక్తంగా స్థానిక సాంఘీక సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని భవనంలో ఏర్పాటుచేసిన ఉచిత వృత్తి విద్య నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈమేరకు కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్చంద సంస్థల ద్వారా అందించే వృత్తి నైపుణ్య శిక్షణలు యువతకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. వీటి నిర్వహణకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పరంగా మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ప్రస్తుతం మంచి డిమాండ్ ఉన్న కోర్సుల్లో నైపుణ్యాలు సాధిస్తే ఆర్థికస్థిరత్వం లభిస్తుందని, బ్యాంకుల ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధి రంగంలోనూ స్థిరపడవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీత, శ్రీషిరిడిసాయి సేవ సొసైటీ అధ్యక్షులు, సాయిలింగి వృద్ధాశ్రమ నిర్వాహకుడు దెబ్బడి అశోక్, ఉపాధ్యక్షుడు నాలం అనిల్, ప్రధాన కార్యదర్శి శివన్న, కోశాధికారి దశరత్ ఉన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

శివసాగర్ ప్రాజెక్టు చెరువు కట్టకు మరమ్మతులు చేయాలి

ఉట్నూర్: మండలంలోని నాగపూర్ శివసాగర్ ప్రాజెక్టును కలెక్టర్ రాజర్షిషా, ఉట్నూర్ సబ్‌కలెక్టర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. శివసాగర్ ప్రాజెక్టు చెరువు కట్ట కింద పగుళ్లు ఏర్పడుతున్నాయని, కట్టకు వెంటనే మరమ్మ తులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎంకా వెళ్తున్న రహదారికి సమీపంలో చెరువుకు ఆనుకుని ఉన్న రోడ్డుకు సైతం మరమ్మతులు చేయించాలని సూచించారు. ఇం దుకు కావాల్సిన అంచనాలను సిద్ధంచేసి పంపాలని అధికారులను ఆదేశించారు. చెరువు తూములకు మరమ్మతులు చేసి రైతుల భూములకు సాగునీరు అందేలా చూడాలని రైతులు మాజీ సర్పంచ్ జగదీష్ జాదవ్‌తో కలిసి కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఈఈ రాథోడ్‌విఠల్, డిప్యూటీ ఈఈ రాథోడ్ వినోద్, అసిస్టెంట్ ఇంజనీర్, రైతులు ఓం ప్రకాష్, శ్రీరాములు పాల్గొన్నారు.



శివసాగర్ ప్రాజెక్టు పరిశీలిస్తున్న కలెక్టర్



రోగులకు సలహాలు ఇస్తున్న వైద్యులు

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

నేరేడిగొండ, జూలై24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీచరలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటుచేసి గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమైనా సమస్యలుంటే ఆరోగ్య కేంద్రంలో వైద్యం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కల్పా న, ఏఎస్ ఆశ కౌసల్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పీఏగా వివేక్

ఆదిలాబాద్,జూలై24 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ వ్యక్తిగత సహాయకుడి (పీఏ)గా వివేక్ గురువారం బాధ్యతలను చేపట్టారు. వ్యవసాయ శాఖలో ఆదిలాబాద్ అర్బన్ ఏవోగా విధులు నిర్వహించిన వివేక్ ఇకపై ఎమ్మెల్యేకు అధికారిక పీఏగా కొనసాగనున్నారు.

ఐటీఐ, ఏటీసీల్లో రెండో దఫా ప్రవేశాలు

ఉట్నూర్, జూలై24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో రెండో దశ ప్రవేశాల కోసం ఈనెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఉట్నూర్ ఐటీఐ ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయిన వారు, 8వ తరగతి వరకు చదువుకున్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నాని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒకే దరఖాస్తు ద్వారా రాష్ట్రంలోని ఏదైనా ఐటీఐ కేటీసీ వెబ్ ఆప్షన్‌ల ద్వారా ఎంపికయ్యే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు ఫీజు 100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, మొదటిసారి దరఖాస్తులు చేసుకున్నవారు రెండోసారి చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

మావల: ప్రభుత్వపారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ప్రభుత్వ అండ్ ఏటీసీ/పీవీటీ ఐటీఐలో రెండో విడత ప్రవేశం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఎన్‌సీవీటీ ప్యాటర్న్ కింద వివిధ ఇంజనీరింగ్ అండ్ నాన్‌ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందడానికి అభ్యర్థులు, విద్యార్థులు ఈనెల 22 నుంచి 31 వరకు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు సమయంలో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్‌చేసి, అభ్యర్థుల యొక్క మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీని పొందుపర్చాలని పేర్కొన్నారు.

దేశభక్తిని పెంచడంలో ఎన్‌సీసీ పాత్ర కీలకం

• లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్‌కుమార్

మావల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): యువతలో దేశభక్తిని పెంపొందించి వారిని భావి సైనికులుగా తీర్చిదిద్దడంలో ఎన్.సి.సి క్రియాశీలక పాత్ర పోషిస్తోందని ఎన్‌సీసీ 32 బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కుమార్ తెలిపారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారతసైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై రూపొందించిన లఘు చిత్రాన్ని గురువారం స్థానిక నలంద కళాశాలలో ప్రదర్శించారు. మే 6 నుంచి 5రోజుల పాటు పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత వాయు సైన్యం జరిపిన దాడులు, పహల్గాం ఘటన, ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన తీరును లఘు చిత్రంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ భారతసైన్యం శత్రు దేశమైన పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసంచేసిన తీరును లఘుచిత్రం ద్వారా ప్రదర్శించామన్నారు. ఉగ్ర దాడులను ఎదుర్కొనే సైనిక సంపత్తి, దేశ యుద్ధ సామర్థ్యం వంటి అంశాలను ఎన్‌సీసీ కెడెట్‌లకు వివరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ స్పెషల్ స్టాఫ్ భగీరథ్, గాలి అశోక్, లక్ష్మణ్, భూమన్న, కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావ్, కళాశాల బోర్డు అధ్యక్షులు సల్ల విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్నల్ అరవింద్ కుమార్



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్, జూలై24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పెట్రోలియం సహజవాయువు విభాగం మంత్రి హరదీప్ సింగ్, కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను గురువారం ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటింటికీ సహజవాయువు గ్యాస్ పైపులైన్ ఏర్పాటు, ద్విచక్ర వాహనాలలో సహజవాయువు, విద్యుత్ ఛార్జింగ్ పాయింట్లు నెలకొల్పాలని మంత్రులను కోరారు. అదేవిధంగా ఆర్మూర్ టు నిర్మల్ రైల్వే మార్గానికి సర్వే పూర్తిచేయించి నిధులు విడుదల చేయాలన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెనలకు నిధులు కేటాయించాలని విన్నవించారు. ఆయా సమస్యలపై మంత్రులు సానుకూలంగా స్పందించారని ఎంపీ, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. వారి వెంట బీజేపీ నాయకులు ముస్తాపూర్ అశోక్ ఉన్నారు.

విధులను బహిష్కరించిన ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు


సిరికొండ, జూలై24 (ఆంధ్రజ్యోతి): గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఈ-పంచాయతీ ఆపరేటర్లు ఎంపీడీవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015 నుంచి ఎంపీడీవో కార్యాలయాల్లో వి ధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వం ఎలాంటి ఉద్యోగభద్రత కల్పించడం లేదన్నారు. రాష్ట్రంలోని 32జిల్లాల్లో 1579మంది మండలస్థాయిలో ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో విధుల్లో ఉన్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జనవరి-2025 జనవరి మాసం నుంచి పొందుతున్న వేతనాల్లో రూ. 22,750కి బదులుగా 19,500 తమ ఖాతాల్లో జమచేస్తూ కోత విధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్, ఆపరేటర్లు రాజేశ్వర్, వినోద్, తదితరులున్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

తలమడుగు , జూలై 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీఎస్) ఆధ్వర్యంలో తలమడుగు మండల నాయబ్ తహసీల్దార్ ప్రభాకర్‌కు మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సర్వీస్ సమస్యలను, ఆర్థికమైన సమస్యలను పెండింగ్‌లో ఉన్నందున వాటన్నిటిని తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగుల సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలన్నారు. అదేవిందంగా అన్ని క్యాడర్ల ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు వెంటనే వాళ్ల సొంత జిల్లాలకు సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శంకర్, రమేష్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్‌కు మెమోరాండం అందిస్తున్న నాయకులు